

వీధి కుక్కలతో జాగ్రత్త!

వేసవిలో వీధి కుక్కలు చెలరేగిపోతున్నాయి. ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. ఇటీవల బేతంచెర్లలో ఓ బాలుడిని చంపేయడం కలకలం రేపింది. 8లో▸



స్నేహితులను కాటేసిన కరెంట్

ఇద్దరు స్నేహితులను కరెంట్ కాటేసింది. కల్యాణ మంటపం వద్ద టెంటు వేసేందుకు వెళ్లగా ఈ విషాద ఘటన ఉరుకుంద గ్రామంలో చోటు చేసుకుంది. 8లో▸



ముత్తలూరులో ఉద్రిక్తత

వక్ఫ్ బోర్డు స్థలాల్లో ఇళ్లు ఉన్నాయని, వెంటనే ఖాళీ చేయాలని రెవెన్యూ సిబ్బంది హెచ్చరించారు. ప్రజలు నిలదీయడంతో ముత్తలూరులో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. 8లో▸

న్యూస్‌రీల్

స్వర్ణ పంచాయత్ పోర్టల్‌లోనే పన్నుల చెల్లింపు



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీపీఓ భాస్కర్

కర్నూలు(అర్బన్): ఇక నుంచి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వర్ణ పంచాయత్ పోర్టల్‌లోనే పన్నుల చెల్లింపు జరగాలని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో డిప్యూటీ ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు పన్నుల చెల్లింపులు ఆన్‌లైన్‌లోనే జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జిల్లాలోని అన్ని ఓహెచ్‌ఎస్‌ఆర్, జీఎల్‌ఎస్‌ఆర్ ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించి, ఎక్కడా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఇళ్ల యజమానుల అసెస్‌మెంట్ నెంబర్‌కు వారి ఆధార్‌ను లింకు చేయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో పశువుల తాగునీటికి సంబంధించి ఏర్పాటు చేసిన టబ్‌లను ఎప్పటికప్పుడు నీటితో నింపాలన్నారు.

12 నుంచి ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 12 నుంచి 20వ తేది వరకు నిర్వహించనున్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్ట్ ఇయర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు జరుగనున్నాయి. మొత్తం 21,342 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 15,292.. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,032 మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణకు 52 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రాక్టికల్స్ ఫెయిల్ అయిన విద్యార్థులకు, గైర్హాజరైన వారికి ఈ నెల 28వ తేది నుంచి జూన్ 1వ తేది వరకు కేవలం జిల్లా కేంద్రంలో మాత్రమే వీటిని నిర్వహించనున్నారు.

కొత్తిమీర అ'ధర'హో



గోనెగండ్లలో సాగుచేసిన కొత్తిమీర

గోనెగండ్ల: ఒక్కసారిగా కొత్తిమీర ధర పెరిగిపోయింది. ఒక మడి ధర రూ. వెయ్యి నుంచి రూ. 1,200 వరకు పలుకుతోంది. పెళ్లిళ్ల సీజన్ కావడంతో కొత్తిమీరకు డిమాండ్ పెరిగింది. గోనెగండ్ల మండలంలో బోర్లు,బావుల కింద 1,500 ఎకరాల్లో రైతులు కొత్తిమీర పంటను సాగుచేశారు. ఈ ఏడాది ఉల్లి, మిరప తదితర పంటలు సాగుచేసిన రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం కొత్తిమీర పంటకు రెండు రోజుల నుంచి ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వేడి కేంద్రాలు!



ఎండలకు చెప్పులు లేకుండా అంగన్‌వాడీ కేంద్రంలోకి వెళ్తున్న చిన్నారులు

ఉక్కపోతతో అల్లాడుతున్న చిన్నారులు

- కర్ణాటక, తెలంగాణలో సెలవులు ప్రకటించిన ప్రభుత్వాలు
- ఆ ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం
- కిశోర వికాసం పేరుతో జూన్ 10 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

కర్నూలు(అర్బన్): చిన్నారుల ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వం కాఠిన్యాన్ని ప్రదర్శిస్తోంది. పక్కనున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను ప్రకటించారు. అయితే ఇక్కడ మాత్రం ప్రభుత్వం సెలవులు ప్రకటించక పోగా, కిశోర వికాసం పేరుతో ఎండలు మండుతున్న ప్రస్తుత వేసవిలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని దాదాపు అన్ని విద్యా సంస్థలకు వేసవి సెలవులు ప్రకటించినా, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వకపోవడం వల్ల ఎండల్లోనే చిన్నారులు అల్లాడిపోతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చాలీచాలని ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తీవ్ర ఉక్కపోతతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, అంగన్‌వాడీ టీచర్లకు 15 రోజులు, హెల్పర్లకు 15 రోజుల సెలవులు మంజూరు చేసినా, ఎవరో ఒకరు మాత్రం కేంద్రాన్ని నిర్వహించాల్సి ఉంది. రెండు నెలల క్రితం జీతాల పెంపుతో పాటు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని అంగన్‌వాడీలు ఆందోళనకు దిగారు. అప్పట్లో ప్రభుత్వం మాటను లెక్కచేయకుండా చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా వేలాది మందితో ధర్నా చేపట్టారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు జీతాలు పెంచకపోగా, వేసవి సెలవులు కూడా ఇవ్వకుండా కక్ష తీర్చుకునే ప్రయత్నం చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రకరకాల యాప్‌లతో ఇబ్బందులు

ఇప్పటికే రకరకాల యాప్‌లతో అంగన్‌వాడీ టీచర్లు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పోషన్, బాల సంజీవిని తదితర యాప్‌ల వల్ల తికమక నెలకొందని, ముఖ్యంగా 2జీబీ మొబైల్స్ ఇవ్వడం వల్ల పలు సందర్భాల్లో సాంకేతిక పరమైన సమస్యలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత వేసవిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చిన్నారులకు ఒంటిపూట బడి పెట్టుకోవాలని టీచర్లు, ఆయాలు తప్పనిసరిగా సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల్లోనే ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కారణంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులు ఎండ వేడిమికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తీవ్ర ఉక్కపోత

ఉదయం 8 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు ఉన్నప్పటికీ ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. చిన్నారులు ఉక్కపోత తాళలేక ఏడుస్తుంటే, వారిని సముదాయించలేక ఆయాలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే విద్యుత్ సరఫరాలో పలు ప్రాంతాల్లో చోటు చేసుకుంటున్న అంతరాయం అంగన్‌వాడీ కేంద్రాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. అలాగే గర్భిణులు, బాలింతలు కూడా పౌష్టికాహారం కోసం ఎండలోనే అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

కిశోర వికాసనం పేరుతో..

వేసవిలో అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించని ప్రభుత్వం కిశోర బాలికల వికాసం పేరుతో ఈ నెల 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది.



అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్ తిరగక చిన్నారుల ఇబ్బందులు

కార్యక్రమం మంచిదే అయినా, వేసవి సెలవుల్లో నిర్వహించడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీలు కన్వీనర్లుగా వారి కేంద్రాల పరిధిలోని కిశోర బాలికలను సర్వే చేసి వారితో సచివాలయాల పరిధుల్లోని ఏఎన్‌ఎం, ఎంఎస్‌కేలతో కలిసి ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రాపౌట్స్, బాల్యా వివాహాలు, పుట్టే బిడ్డల ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని ఆదేశాలను జారీ చేసింది. ఎండలు తీవ్ర ప్రభావం చూపే మే నెలలో సమావేశాలు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ కావడం పట్ల అంగన్‌వాడీ టీచర్లు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు



అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ నెల 1 నుంచి నెల రోజుల పాటు సెలవులు ఇవ్వాలని అడిగాం. ఇంత వరకు అతీగతీ లేదు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని ఇళ్లకు ఇవ్వాలన్నా ఈ ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి. పని ఒత్తిడి తగ్గిస్తామని చెప్పారు కానీ ఇంకా పెంచుతున్నారు. జీతాల విషయంలోనూ ఆలోచించట్లేదు. ఎండలు ఎక్కువగా ఉన్నా చిన్నారుల విషయంలో శ్రద్ధ చూపకపోవడం దారుణం. – నిర్మల, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు (సీఐటీయూ)

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు...

ప్రాజెక్టు పేరు	అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య	3 నుంచి 6 సంవత్సరాల చిన్నారులు
ఆదోని	224	8,057
ఆలూరు	176	6,515
ఆస్పరి	131	5,048
కోడుమూరు	254	9,161
కర్నూలు	272	12,379
మంత్రాలయం	251	13,458
పత్తికొండ	187	6,113
వెల్దుర్తి	109	4,114
ఎమ్మిగనూరు	282	12,411
మొత్తం	1886	77,256

పక్క రాష్ట్రాలు సెలవులను ప్రకటించాయి



అంగన్‌వాడీ కేంద్రాలకు పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలు సెలవులు ప్రకటించాయి.మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. వేసవిలో కేంద్రాలకు సెలవులు ఇవ్వాలని రెండు నెలలుగా అడుగుతున్నా, ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. ఇటీవలి కాలంలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం చోటు చేసుకుంటోంది. పలు కేంద్రాల్లో ఫ్యాన్లు ఉండవు,ఇరుకు గదుల్లో పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు. – జె.లలితమ్మ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (ఏఐటీయూసీ)

చిన్నారులకు ఇబ్బంది కలగనివ్వం



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఫీడింగ్‌కు ఇబ్బంది తలెత్తకూడదని ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఉంచుకొని ఇళ్లకు పంపమన్నాం. నెలలో మొదటి 15 రోజులు హెల్పర్, మిగిలిన 15 రోజులు వర్కర్ ఉండాలని ఉత్తర్వులు ఇచ్చాం. వేసవిలో చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆదేశాలు జారీ చేశాం.

– నిర్మల, ఐసీడీఎస్ పీడీ

'పురాతన' ఆనవాళ్లు ఛిద్రం చేయొద్దు

- అధికారులకు కేతవరం గ్రామస్తుల వినతి



అధికారికి వినతి పత్రం సమర్పిస్తున్న కేతవరం గ్రామస్తులు

ఓర్వకల్లు: పురాతన రాతి చిత్రాల ఆనవాళ్లను ఛిద్రం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, శివాలయ ప్రాంతంతో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను కేతవరం గ్రామస్తులు కోరారు. కేతవరం గ్రామ రెవెన్యూ పరిధిలో మైనింగ్ విస్తరణ పనులకు మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆర్‌డీఓ సందీప్‌కుమార్, కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ కిషోర్‌రెడ్డి, ప్రజా సంఘాలు, పర్యావరణ వేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ సందీప్‌కుమార్ మాట్లాడుతూ.. గతంలో 288 సర్వే నంబర్‌లో 20.24 హెక్టార్లలో సిలికా శాండ్, క్వార్ట్జ్ తవ్వకాల కోసం ప్రభుత్వ భూమిని లీజ్‌కు తీసుకుందన్నారు. ప్రస్తుతం అదే సర్వే నంబర్‌లో సిలికా శాండ్, క్వార్ట్జ్ మిశ్రమాన్ని తయారు చేయుట కోసం పనులను విస్తరించుటకు ప్రతిపాదనలు పంపామన్నారు. కేతవరం గ్రామాభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ గోవర్ధన్ కోరారు. పంటలకు ఎలాంటి నష్టం జరుగకుండా బ్లాస్టింగ్ పనులు చేయాలని ప్రజలు విన్నవించారు. కేతవరం నుంచి కన్నమడకలకు రాకపోకల నిమిత్తం రహదారిని నిర్మించాలని కోరారు. మైనింగ్ విస్తరణను వ్యతిరేకిస్తున్నట్లు కొందరు చెప్పారు.

రెక్కల కష్టాన్ని దోచేస్తారా?

- ఏపీఓను నిలదీసిన 'ఉపాధి' కూలీలు

పగిడ్యాల: ఉపాధి పనులకు వెళ్లిన తమకు దినసరి వేతనాలు తక్కువ వేస్తున్నారని కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రెక్కల కష్టాన్ని ఇలాగే దోచేస్తారా' ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీలకు ఇలా నష్టం చేస్తారా అంటూ ఏపీఓ మద్దిలేటిని నిలదీశారు. స్థానిక కార్యాలయానికి మంగళవారం ఉపాధి కూలీలు వచ్చారు. సంకిరేణిపల్లె, ముచ్చుమర్రి, నెహ్రూనగర్ గ్రామాల్లో ఆరు రోజులకు వేతనాలు వేస్తున్నారని, పగిడ్యాల, బీరవోలు, పాలమర్రి గ్రామాల్లో మాత్రం నాలుగు రోజులకే వేతనాలు వేసి కూలీలకు కోత విధిస్తున్నారని మండిపడ్డారు. ఆరు రోజులు పనిచేస్తే నాలుగు రోజులకు మాత్రమే డబ్బులు ఎలా వేస్తున్నారని ప్రశ్నించారు. ఇష్టారాజ్యంగా చేస్తున్నందునే అలా వేస్తున్నారని ఏపీఓ మద్దిలేటి వెల్లడించారు.

'మోహినీ' అలంకరణలో సింహరూపుడు



ఆళ్లగడ్డ: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎగువ అహోబిలంలో సింహరూపుడైన లక్ష్మీనృసింహస్వామి జగన్మోహినీ అలంకరణతో భక్తులను కనువిందు చేశారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామి అమ్మవార్లను మేలుకొలిపి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహ స్వామిని యాగశాలలో కొలువుంచి నవకలశ స్థాపన గావించారు. ప్రహ్లాదవరదుడిని నూతన పట్టుపీతాంబరాలతో మోహినీగా అలంకరించి పల్లకీలో కొలువుంచి భక్తుల గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాల మధ్య తిరుమాడ వీధుల్లో ఊరేగించారు.

పురుగు మందు తాగి చస్తాం

- పేదల కడుపు కొట్టేందుకు రాజకీయాలు చేస్తున్నారు
- కన్నీరు పెట్టిన దళిత పారిశుద్ధ్య మహిళా కార్మికులు
- వెల్దుర్తి సీహెచ్‌సీ ఎదుట నిరసన



తమకు న్యాయం చేయాలంటూ ప్లాస్టిక్ కవర్‌లో పురుగు ముందు డబ్బా పెట్టుకుని కన్నీళ్లతో వేడుకుంటున్న పారిశుద్ధ్య మహిళా కార్మికులు

వెల్దుర్తి: '' ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా కుటుంబాలకు దూరంగా ఉండి కరోనా సమయంలో పారిశుద్ధ్య పనులు పనిచేశాం.. మా సేవలను మరచి మమ్మల్ని తొలగించాలని రాజకీయాలు చేస్తున్నారు.. మాకు న్యాయం జరగకపోతే మేమందరం కుటుంబ సమేతంగా పురుగు మందు తాగి చస్తాం.' అంటూ దళిత పారిశుద్ధ్య మహిళా కార్మికులు ప్రశాంతి, రాధ, కృష్ణవేణి కన్నీరు పెట్టారు. పిల్లల్ని వెంట బెట్టుకుని వెల్దుర్తి సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్ – సామాజిక ఆరోగ్య కేంద్రం) వద్దకు వచ్చి మంగళవారం నిరసన తెలిపారు. ప్లాస్టిక్ కవర్‌లో తెచ్చిన పురుగు మందు డబ్బాను కూడా విలేకరులకు చూపారు.. బాధిత మహిళలు తెలిపిన వివరాలు వారి మాటల్లోనే.. '' మమ్మల్ని 2019లోనే శానిటేషన్ వర్కర్లుగా కాంట్రాక్ట్ పద్ధతిన నియమించారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చిన్న సమస్య లేకుండా పనిచేసుకుంటూ వచ్చాం. ప్రాణాలు పోతాయని తెలిసినా కరోనా రోగులతో కలిసి ఆసుపత్రిలో విధులు నిర్వహించాం. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి మాకు కష్టాలు మొదలయ్యాయి. మా భర్తలు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారన్న ఒకే కారణంతో మాపై కక్ష కట్టారు. ఇది తెలిసి మేం టీడీపీ నాయకులకు మా కష్టాన్ని విన్నవించాం. ఎమ్మెల్యే శ్యాంబాబు కూడా ' పేదల కడుపు కొట్టమమ్మా, మీ పని మీరు ప్రశాంతంగా చేసుకోండి' అంటూ హామీ ఇచ్చారు. చివరకు మా కాంట్రాక్టరు శివప్రసాద్ 'పై నుంచి ఒత్తిడి పెరిగిందమ్మా, ఎమ్మెల్యే మనుషులంటూ, పీఏ అంటూ మిమ్మల్ని తీసేయమని బెదిరింపులు వస్తున్నాయి. నేను ఏమీ చేయలేను' అంటూ సమాధానమిచ్చాడు. మాకు న్యాయం జరగకపోతే మేమందరం కుటుంబ సమేతంగా పురుగుల మందు తాగి చస్తాం.'' అంటూ కన్నీరు పెట్టారు.

జొన్న రైతుకు 'వ్యయ'ప్రయాస





దీబగుంట్ల వద్ద రోడ్డు పొడువునా నిలిచిన జొన్న ట్రాక్టర్లు (ఇన్‌సెట్) పొలంలో నిరీక్షిస్తున్న రైతులు

- మద్దతు ధరతో కొనుగోలు చేయని ప్రభుత్వం
- రోజుకొక గోడౌన్‌కు తిరగాల్సిందే!

గోస్పాడు: జొన్నలను రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయడం లేదు. ఇందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా ప్రతి రోజూ తికమక పెడుతోంది. దీంతో రైతులకు ఖర్చులు తడిసి మోపెడుతున్నాయి. ముందుగా నంద్యాలలోని సెంట్రల్ వేర్ హౌస్ గోడౌన్ వద్దకు జొన్నలను తీసుకెళ్లేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోజుకు ట్రాక్టర్‌కు అయితే రూ. 1,300నుంచి రూ. 1,800 వరకు, లారీకి అయితే రూ. 2వేల నుంచి రూ. 2,500 వరకు ఖర్చు చేశారు. జొన్నలు అమ్ముకోవడానికి క్యూలో నిల్చొని నాలుగైదు రోజులు గడిచాక నంద్యాల సెంట్రల్ వేర్ హౌస్ నుంచి దీబగుంట్ల లోని గోడౌన్‌కు పంపించారు. మంగళవారం దీబగుంట్లకు వచ్చిన తర్వాత గోపవరం సమీపంలోని గోడౌన్‌కు తరలించాలని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోడౌన్ ఖాళీగా ఉన్నా ఇలా ఎందుకు చేశారని ప్రశ్నించారు. రోజుల తరబడి క్యూలో నిలపాల్సి వస్తోందని, ఖర్చులు మరింత పెరిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు రైతులు ట్రాక్టర్ల వద్ద నిద్రిస్తూ కనిపించారు. మరికొందరు పొలాల్లో వేచి చూశారు.



కొనుగోలు చేసేందుకు జొన్నలను పరిశీలిస్తున్న అధికారి



దీబగుంట్ల దగ్గర ఖాళీగా ఉన్న గోడౌన్

కష్టాలు అన్నీఇన్నీ కావు



ఈ ఏడాది జొన్న సాగు చేసిన రైతులకు దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చాయి. మార్కెట్‌లో సరైన ధర లేక రైతులు అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో కొంత మేరకు ఉపశమనం వచ్చినా కష్టాలు అన్నీఇన్నీ కావు. బాడుగలు భారంగా మారుతున్నాయి.

– ప్రతాపరెడ్డి, ఎం.చింతకుంట్ల, గోస్పాడు మండలం.

అర్థం కావటం లేదు



నంద్యాల సెంట్రల్ వేర్ హౌస్ వద్ద ఉన్న మమ్మల్ని తిరిగి దీబగుంట్లకు తీసుకెళ్లాలని చెప్పడంతో ఇక్కడికి వచ్చాం. ఇక్కడికి వచ్చాక తిరిగి గోపవరం వద్దకు తీసుకెళ్లాలని చెప్పారు. మాకేం అర్థం కావటం లేదు. ఒకసారి కుదుర్చుకున్న బాడుగలకు తిరిగి క్వింటాకు రూ. 50 వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

– వలి, పెసరవాయి, గడివేముల మండలం

క్లుప్తంగా

రాజ గోపురం నిర్మాణానికి రూ.13 లక్షలు విరాళం



పూలచింతలో మఠం ఉపపీఠాధిపతి బండేప్ప స్వామికి విరాళం అందజేస్తున్న గ్రామ పెద్దలు

నందవరం: పూలచింత గ్రామంలో వెలసిన శ్రీ బండేగురుడి మఠం రాజ గోపురం నిర్మాణానికి భక్తులు విరాళం అందించారు. మంగళవారం గ్రామంలో గ్రామ సర్పంచ్ అక్కమహాదేవి ఆధ్వర్యంలో మఠం ఉప పీఠాధిపతి బండేప్ప స్వామికి గ్రామ పెద్దలు, గ్రామస్తులు రూ.13 లక్షలు విరాళం అందజేశారు. గ్రామస్తులు మఠం అభివృద్ధికి, గోపురం నిర్మాణానికి తమ సహాయంగా విరాళం అందించారు. ఈ సందర్భంగా ఉప పీఠాధిపతి మాట్లాడుతూ.. పీఠాధిపతి జయ శంకర స్వామి ఆశీస్సులతో మఠాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామస్తులు, భక్తులు ఇచ్చిన విరాళంతో రాజ గోపుర నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

పురాతన బావుల సమాచారం ఇవ్వండి

నంద్యాల(వ్యవసాయం): జిల్లాలోని పురాతన కాలంనాటి పాడుబడిన కోనేరులు, మెట్ల, దిగుడు బావుల సమాచారం ఇవ్వాలని ఇన్ టచ్ నంద్యాల చాప్టర్, మన ఊరు–మన గుడి, మన బాధ్యత గౌరవ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి మంగళవారం తెలిపారు. జిల్లాలోని పురాతన కాలం నాటి దిగుడు బావులు, కోనేరులు ఉంటే ఆ ఊరి ప్రజలతో తమ సంస్థ సభ్యులు కలసి వాటిని ఉపయోగంలోకి తెచ్చేలా కృషి చేస్తామన్నారు. కోనేరులు, బావుల్లో ఉన్నటువంటి వివరాలు తెలిపే శాసనాలు తదితర ఉంటే 8919547562కు ఫొటోలతో సహా పంపినట్లయితే వాటిని పునరుద్ధరించి సమష్టి కృషి చేస్తామని తెలిపారు.

ఆవుల మందపై మళ్లీ పెద్ద పులి దాడి

వెలుగోడు: తెలుగు గంగ ప్రాజెక్టులో భాగమైన మద్రాస్ కాల్వ వద్ద పంట పొలాల్లో ఆవుల మందపై పెద్దపులి మళ్లీ దాడి చేసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం దాడి చేసి పులి ఒక ఆవును చంపిన విషయం విదితమే. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 20 రోజుల ఆవు దూడను చంపేసిందని అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. పెద్దపులి వరుస దాడులతో రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పెద్ద పులి నుంచి ఆవులను కాపాడి నష్టపరిహారం చెల్లించాలని రైతు సేవా నాయక్ అటవీ అధికారులను కోరారు.

వేసవిలో వీధి కుక్కలతో జాగ్రత్త!

- నీళ్లు, ఆహారం లభించక వీధి కుక్కల ప్రవర్తనలో సమూల మార్పులు
- పిచ్చి పట్టి దాడులకు పాల్పడుతున్న వైనం
- బేతంచెర్లలో బాలుడిని కొరికి చంపడం పట్ల సర్వత్రా ఆందోళన
- వీధి కుక్కల నియంత్రణను గాలికొదిలేసిన అధికారులు



కర్నూలు(అగ్రికల్చర్): వేసవిలో వీధి కుక్కలు చెలరేగిపోతున్నాయి. నీళ్ల, ఆహారం లభించకపోవడం, వడదెబ్బకు గురవుతుండటంతో పిచ్చి, పిచ్చిగా వ్యవహరిస్తూ జనాలపై దాడులకు పాల్పడుతున్నాయి. జనాలతో పాటు జంతువులు, గొర్రెలు, మేకలపై దాడులకు తెగబడుతున్నాయి. ఇటీవల నంద్యాల జిల్లా బేతంచెర్లలో వీధి కుక్కలు ఓ బాలుడిపై దాడి చేసి కొరికి చంపేయడం కలకలం రేపింది. అధిక ఉష్ణోగ్రతల వల్ల వడదెబ్బకు గురికావడం, తాగేందుకు నీళ్ల, తినడానికి ఆహారం లభించక పోవడంతో వాటి వాటి ప్రవర్తన సహజత్వానికి భిన్నంగా ఉంటోంది. చికాకు వల్ల పిచ్చిపట్టినట్లుగా ఉండి కనిపించిన వారిపై దాడులకు పాల్పడుతుంటాయి. ఉమ్మడి జిల్లాలో పెంపుడు కుక్కలు 34,105 ఉండగా.. వీధి కుక్కలు 1.50 లక్షల వరకు ఉంటాయని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. వీధి కుక్కలను నియంత్రించాల్సిన బాధ్యత అర్బన్ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీలు చేపట్టాలి. వీధి కుక్కల సంతతిని తగ్గేందుకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు పెద్ద ఎత్తున చేపట్టాలి. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా వీధి కుక్కల నియంత్రణ గురించి పట్టించుకునే వారే లేరు. కుటుంబ నియంత్రణ వల్ల వీధికుక్కల సంఖ్య తగ్గుతుంది. ఆపరేషన్‌లు అయిన కుక్కలు దీర్ఘాయుస్సుతో బతకడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటాయి. కుక్కలు ఎటుపడితే అటు తిరగడం పోట్లాడటానికి ఇష్టపడవు. 75 శాతం వీధికుక్కలకు రేబిస్ టీకాలు వేయడం వల్ల ఆ ప్రాంతాన్ని రేబిస్ రహితంగా మార్చవచ్చు. చెవిని కత్తిరించి 'వీ' ఆకారంలో ఉంటే ఆపరేషన్ అయిందని గుర్తు. ఇప్పటికైన ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వీధి కుక్కల నియంత్రణపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతో ఉంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

2024–25లో వీధి కుక్కలు జిల్లాలో స్వైరవిహారం చేయగా అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కర్నూలు నగరపాలక సంస్థలో వీధి కుక్కల నియంత్రణ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టింది. కర్నూలు నగరంలో దాదాపు 15 వేలకుపైగా వీధి కుక్కలను గుర్తించి 9,341 వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసినట్లు తెలుస్తోంది. కాగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. కర్నూలు నగరంతో పాటు మున్సిపాలిటీలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో వీధికుక్కల బెడద తీవ్రమవుతోంది. ఆదోని, నంద్యాల, ఎమ్మిగనూరు, గూడూరు, డోన్, బనగానపల్లి, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, బేతంచెర్ల, నందికొట్కూరు పట్టణాల్లో వీధి కుక్కల గురించి పట్టించుకోకపోవడంతో స్వైరవిహారం చేస్తున్నాయి.

చేయకూడనివి...

- మిగిలిపోయిన ఆహారం, ఎముకలు ఎక్కడబడితే అక్కడ వేయరాదు. ఎందుకంటే తిండి దొరికినంతకాలం వీధుల్లో కుక్కల సంతానం వృద్ధి చెందుతూనే ఉంటుంది.
- పెంపుడు కుక్కలను వీధుల్లోకి వదిలివేయరాదు.
- పెంపుడు కుక్కలను ఇళ్లలో ఎల్లవుడూ కట్టి ఉంచరాదు. దీనివల్ల వాటిల్లో ఆగ్రహం పెరుగుతుంది. వీధి కుక్కలు వెంబడించినపుడు బైక్స్, సైకిళ్ల వేగం పెంచరాదు.

కుక్క కాటేస్తే...

కరిచిన చోట కుళాయి లేదా చెంబుతో నీటిధారపోస్తూ సబ్బుతో పది నిముషాలు కడగాలి. లైఫ్‌బాయ్ సబ్బు అయితే మంచిది. డెట్టాల్, బిటాడిన్ లేదా గడ్డం గీసుకున్న తర్వాత వాడే లోషన్ పూయాలి. వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించాలి. పిచ్చి కుక్క అయితే మాత్రం వెంటనే రేబిస్ టీకాలు వేయించాలి.అయితే గాయాన్ని రుద్ది కడగరాదు. గాయంపై టింక్చర్ అయోడిన్ వేయకూడదు. గాయానికి కుట్లు వేయడం, గట్టిగా నొక్కడం చేయరాదు.

పెంపుడు కుక్కలను ఎండల్లో ఉంచరాదు...

ప్రస్తుతం పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ పెంపుడు కుక్కల పెంపకం ఎక్కువగా ఉంటోంది. ప్రధానంగా ఇంటికి రక్షణ కోసం మేలు జాతి కుక్కలను పోషిస్తున్నారు. కొంతమందికి కుక్కల పెంపకం హాబీగా మారింది. పెంపుడు కుక్కలు వేసవిలో వేడిని తట్టుకోలేవు. వేడిని భరించలేక దాడులకు పాల్పడే ప్రమాదం ఉంది. పెంపుడు కుక్కలను ఎక్కువసేపు ఎండలో ఉండకుండా జాగ్రత్త పడాలి. చల్లని నీరు అందుబాటులో ఉంచాలి. వేసవిలో మాంసాహారం తగ్గించాలి. మాంసాహారం తీసుకుంటే శరీర ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఇవి నలతగా ఉన్నా... అనారోగ్యంగా కనిపించినా వెంటనే పశువైద్యులను సంప్రదించాల్సిన అవసరం ఉంది.



కుక్క కాటు నుంచి ఇలా తప్పించుకుందాం...

- కుక్క దగ్గరికి వస్తే ఏ మాత్రం కదలకుండా నిలబడి ఉండటం ఉత్తమం. వాటి దగ్గరున్నపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగెత్తరాదు. వాటి కళ్లలోకి తదేకంగా చూడరాదు. వాటి పిల్లల దగ్గరికి వెళరాదు. తల్లి కుక్క దాడి చేసే ప్రమాదం ఉంది.
- నిద్రిస్తున్నపుడు, తింటున్నపుడు, పిల్లలకు పాలిస్తున్నపుడు వాటిని కర్రలు, రాళ్లతో అదిలించడం గాని, ఏ రకంగానైన ఇబ్బంది పెట్టడం పెట్టడం చేయరాదు.
- కుక్క దాడి చేస్తే ముఖాన్ని పంచే, తువ్వాలు మొదలగు వాటితో కప్పుకోవాలి. ఏమీ లేకపోతే చొక్కాను పైకి జరుపుకోవాలి. లేదా ముఖాన్ని చేతులతో కప్పుకోండి. ఎందుకంటే ముఖాన్ని కరిస్తే ఇన్‌ఫెక్షన్ మెదడుకు త్వరగా సోకుతుంది.
- కుక్క కోపంగా మీ దగ్గరికి వస్తే నేల వైపు చూస్తూ కుక్కకు దూరంగా మెల్లగా నడవాలి.

ముత్తలూరులో ఉద్రిక్తత

వక్ఫ్ బోర్డు స్థలాలంటూ నోటీసులు

- ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాలన్న రెవెన్యూ సిబ్బంది
- తిరగబడిన గ్రామస్తులు





ముత్తలూరులో రోడ్డుకు ఇరువైపులా నిర్మించుకున్న గృహాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు చూపుతున్న కాలనీవాసులు

రుద్రవరం: మండల పరిధిలోని ముత్తలూరులో మంగళవారం రెవెన్యూ సిబ్బంది, కాలనీ వాసుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. మీరు నివసించే స్థలాలు వక్ఫ్ బోర్డుకు సంబంధించినవని, వెంటనే ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాలని రెవెన్యూ సిబ్బంది కాలనీ వాసులను హెచ్చరించారు. అయితే 1967లో స్థలాలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని, ఇప్పుడు ఖాళీ చేయమంటే ఎలాగని కాలనీవాసులు నిలదీయడం ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలివీ.. ముత్తలూరు 146 సర్వే నంబరులో 3.36 ఎకరాల పొలం ఉంది. అయితే అక్కడ నివసించిన పూర్వీకులు ముళ్ల వంశీయులు కొంత మంది ఇవన్నీ తమ భూములేనని ఎవరికి వారు వివిధ సామాజిక వర్గాల వారికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించారు. దాదాపు 55 ఏళ్ల నుంచి కొనుగోలుదారులు ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, తాగు నీటి సౌకర్యం వంటి వసతులు కల్పించారు. అయితే కొద్ది కాలంగా ఆ స్థలాలు వక్ఫ్ బోర్డుకు సంబంధించినవని, కొలతలు వేసి స్వాధీనం చేసుకుంటామని ఆ శాఖ ఇన్స్‌పెక్టర్ షేక్ ఇమ్రాన్ కాలనీ వాసులు 45 మందికి నోటీసులు పంపించారు. 6వ తేదీన కొలతలు వేస్తున్నామని, సహకరించాలని కాలనీవాసులకు రెండో నోటీసు పంపించారు. అలాగే 146 సర్వే నంబరుపై కొలతలు వేయించి తమ స్థలాలను అప్పగించాలని తహసీల్దారును కోరారు. దీంతో తహసీల్దారు మండల సర్వేయరు రమణ, ఓబులేసు, వీఆర్వో, వీఆర్‌ఏలు అందరూ కలిసి కాలనీలోకి వెళ్లారు. అక్కడ సర్వేయర్ కాలనీ వాసులను పిలిచి కొలతలు వేస్తున్నామని చెప్పడంతో ఎలా వేస్తావని, ఆ స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు చూపించారు. ఎన్నో ఏళ్ల నుంచి నివాసాలు ఉంటున్న తమను ఖాళీ చేయమనడం సబబు కాదని వాపోయారు. తాము ముల్లా వారితో కొన్న స్థలాలని, క్రయ విక్రయాలు జరిగే సమయంలో వక్ఫ్ బోర్డు అధికారులు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. ఇదిలాఉంటే ఇంత జరుగుతున్న సమస్యకు కారణమై వక్ఫ్ బోర్డు ఇన్స్‌పెక్టర్ మాత్రం అక్కడికి రాకపోవడం గమనార్హం.

ఉత్తీర్ణత శాతం మెరుగుపరచండి

- డీఈఓ శామ్యూల్‌పాల్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్‌పాల్

ఆదోని సెంట్రల్: పదో తరగతి పరీక్షల్లో తప్పిపోయిన విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ అన్నారు. పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి సబ్జెక్టు టీచర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీ, గురుకులం, పురపాలక, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు 31,185 మంది పదో తరగతి పరీక్షలు రాశారన్నారు. వారిలో 20,585 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 10,600 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు పేర్కొన్నారు. ఉత్తీర్ణత శాతంలో మన జిల్లా 25వ స్థానానికి పడిపోయినట్లు వారి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు 75 శాతం వృద్ధిని సాధిస్తే అది టీచర్స్ సక్సెస్‌గా, 50 శాతం ఉత్తీర్ణత సాధిస్తే అది విద్యార్థి సక్సెస్‌గా మన జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా పేర్కొన్నట్లు చెప్పారు. 50 శాతం తక్కువగా ఉత్తీర్ణత సాధించిన పాఠశాలకు నోటీసులు ఇవ్వాలని సూచించినట్లు చెప్పారు. పెద్దకడబూరు, కౌతాళం, ఆలూరు మండలాల్లో కొన్ని పాఠశాలల్లో అత్యధికంగా ఫెయిల్యూర్ అయిన విద్యార్థులు ఉన్నారన్నారు. పత్తికొండ డివిజన్ ఉత్తీర్ణత శాతంలో వెనకబడినట్లు చెప్పారు. సమావేశంలో డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

- డ్వామా పీడీ వెంకట రమణయ్య



పెద్దహోతూరు సమీపంలో ఫాంపాండ్ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకట రమణయ్య

ఆలూరు రూరల్: ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా డ్వామా పీడీ వెంకట రమణయ్య ఉపాధి హామీ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని పెద్దహోతూరు, ఆలూరు గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన ఉపాధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ మస్టర్ తప్పుదారి పట్టించినా, ఒకే ఫొటోను ఇతర మస్టర్లలో అప్‌లోడ్ చేసినా.. పాత పనులనే కొత్త పనులుగా చూపుతూ మస్టర్లలో ఫొటోలు అప్‌లోడ్ చేస్తే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు, టీఏలపై చర్యలు తప్పవని చెప్పారు. నిర్దేశించిన పనుల లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీఓ శ్రీనివాసులుకు సూచించారు. ఫాంపాండ్ పనులు వేగవంతం చేయాలన్నారు. జాబ్ కార్డు ఉన్న కూలీలకు వంద రోజుల పని కల్పించాలన్నారు. ప్రతి రోజు రూ.300 ఉపాధి కూలీ అందేలా పని చేయించాలని చెప్పారు. పని ప్రదేశంలో ఆన్‌లైన్ మస్టర్లు నమోదు చేయాలన్నారు. స్థానిక కసూర్బా గాంధీ పాఠశాలలో నిర్మించిన రూఫ్ వాటర్ గుంతను పరిశీలించారు. పని అంచనా, మెటీరియల్ కాంపోనెంట్ నిధులపై అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద మొక్కల పెంపకాన్ని పరిశీలించారు.

సారా జోలికి వెళ్లొద్దు



మాట్లాడుతున్న నంద్యాల అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేయడం, విక్రయించడం నేరమని, వాటి జోలికి వెళ్లి జైలుపాలు కావద్దని నంద్యాల అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి. రాముడు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని అల్వాల కళ్యాణ మండపంలో నవోదయం కార్యక్రమంలో భాగంగా కిరాణ వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని వ్యాపారులందరూ సారా తయారు చేసే వారికి బెల్లం విక్రయించొద్దంటూ సూచించారు. కోళ్లబావాపురం, పట్టణంలోని నీలిషికారిపేటకు చెందిన ప్రజలకు బెల్లం అమ్మకంలో నియంత్రణ పాటించాలన్నారు. నాటుసారా తయారీ చేయడానికి బెల్లం వనరుగా మారిందని గుర్తుచేశారు. ఆయా ప్రాంతాల్లో సారా తయారు చేసి విచ్చలవిడిగా ఇతర గ్రామాలకు సరఫరా చేస్తున్నారని, ఈ మేరకు కట్టడికి చర్యలు చేపట్టామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నాటు సారా బెల్లం అమ్మితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిరాణం దుకాణాల అసోసియేషన్ అధ్యక్షుడు వజీర్‌బాషా, గౌరవ అధ్యక్షులు నగేష్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్, టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు నాయక్, ఎస్‌ఐలు జప్రుల్లా, శ్రీనివాసులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణంలోని రాంజల చెరువు గట్టు సమీపంలో ఆటో బోల్తా పడి మంగళవారం సాయంత్రం ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు ప్రశాంత్‌నగర్‌కు చెందిన లోకేష్, నరసింహులు చెరువుగట్టు వద్ద వాకింగ్ చేస్తుండగా యల్లమ్మ కొండ నుంచి ఆటో వస్తూ వారిద్దరినీ ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లోకేష్, నరసింహులతోపాటు ఆటోలో కూర్చొన్న అరుంజ్యోతినగర్‌కు చెందిన ఈరన్న, సురేష్, గణేష్, కేశయ్య, అంజిలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తాం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి




మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (అర్బన్): 70 ఏళ్ల వయస్సు పైబడిన ఖైదీలకు, అనారోగ్యంతో బాధ పడేవారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, అలాగే బెయిల్ త్వరగా మంజూరయ్యేలా కృషి చేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పురుషుల కేంద్ర కారాగారం, మహిళల కారాగారాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్లినిక్‌లో ఒక న్యాయవాది, ఒక పారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయం అందిస్తారన్నారు. జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేసుకోవాలని కోరారు. ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఖైదీలకు అందించే ఆహారాన్ని, రేషన్‌తో పాటు వారి ఆరోగ్య పరిస్థితిని, తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైదీలను కోర్టు వాయిదాలకు కచ్చితంగా హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్నూలు వారిని సంప్రదించాలన్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జైలు అధికారులు, న్యాయవాది శివరాం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జీఎస్‌టీ వసూళ్లలో మెరుగుదల

- వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్‌రావు



కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల కంటే కర్నూలు జిల్లాలో జీఎస్‌టీ వసూళ్లలో మెరుగుదల సాధించినట్లు వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్‌రావు చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్‌లో రూ.89.404 కోట్లు జీఎస్‌టీ రాగా, ఈ ఏడాది ఏప్రిల్‌లో 99.55కోట్లు జీఎస్‌టీ వసూళ్లు వచ్చాయని, ఈ మేరకు 12 శాతం పెరుగుదల కనిపించిందని తెలిపారు. జిల్లాలో గ్రీన్ ఎనర్జీ, సోలార్ ఎనర్జీ, మైనింగ్ తదితర కార్యకలాపాల వల్ల ఇది సాధ్యమైందని తెలిపారు. ఆన్‌లైన్‌లో జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో అక్రమాలు జరుగుతున్నాయని గమనించి గత నాలుగు నెలల నుంచి నేరుగా కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ మేరకు ప్రతి నెలా 200లకు పైగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో లాగా ఇప్పుడు తనిఖీలు చేసే విధానం మారిందన్నారు. ఇప్పుడు రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తేనే తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రెగ్యులర్‌గా జీఎస్‌టీ అధికారులకు ఆయా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించేలా డ్యూటీలు వేస్తారని, ఈ మేరకు వారు వాహనాలను తనిఖీలు చేస్తారన్నారు. జీఎస్‌టీ చెల్లించని, అక్రమంగా వస్తువులను రవాణా చేసే వాహనాలను పట్టుకుని సీజ్ చేస్తామని తెలిపారు. ఫెనాల్టీ చెల్లించని పక్షంలో వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. ఆ తర్వాత ఇలా స్వాధీనం చేసుకున్న వస్తువులను వేలం వేస్తామన్నారు. ఇటీవల ఆదోనిలో స్థానిక పోలీసులతో కలిసి ఓ బంగారు వ్యాపారి వద్ద అక్రమ బంగారాన్ని గుర్తించి రూ.9 లక్షలు జరిమానా విధించామని వివరించారు.

స్నేహితులను కాటేసిన కరెంట్

- పెళ్లి డెకరేషన్ పనులు చేస్తుండగా విద్యుదాఘాతం
- ఇద్దరు యువకుల మృత్యువాత
- తక్కువ ఎత్తులో విద్యుత్ లైన్ వెళ్లడంతో ప్రమాదం
- ఉరుకుందలో విషాదం





సునీల్(ఫైల్), మహేంద్ర(ఫైల్)



కల్యాణ మండపం వద్ద తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

కౌతాళం: రెక్కల కష్టంతో కుటుంబాలను పోషిస్తున్న ఇద్దరు స్నేహితులను మృత్యువు కబళించింది. అప్పటి వరకు కబుర్లు చెప్పుకుంటూ ఒకరికి ఒకరు సహాయం అందించుకుంటూ పనులు చేస్తున్న వారిని కరెంట్ కాటేసింది. ఈ విషాద ఘటన ఉరుకుంద గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామంలోని దళిత కాలనీకి చెందిన కట్టవీధి సునీల్ అలియాస్ నాని (24), అదే కాలనీకి చెందిన మహేంద్ర (23) ఇద్దరు స్నేహితులు. ప్రతి రోజు ఇద్దరు టెంట్ హౌస్‌లో పని చేస్తూ శుభకార్యాలకు టెంట్లు ఏర్పాటు చేసేవారు. ఇందులో భాగంగానే మంగళవారం ఉదయం ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద పెళ్లికి సంబంధించిన టెంటు వేసేందుకు వెళ్లారు. కాగా ప్రమాదవశాత్తు ఇనుప కడ్డీకి పైన ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో సునీల్, మహేంద్ర విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డారు. సమాచారం తెలుసుకున్న మృతుల కుటుంబసభ్యులు ఘటన స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. మృతుల కుటంబీకుల ఫిర్యాదు మేరకు కౌతాళం సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు సునీల్‌కు భార్య వనిత, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. వనిత రోదిస్తున్న తీరు పలువురిని కంట తడి పెట్టించింది. మహేంద్రకు ఇంకా పెళ్లి కాలేదు. చేతికొచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు తిక్కమ్మ, నాగన్న బోరున విలపిస్తున్నారు. ఇక తమకు దిక్కెవరూ అంటూ రోదించారు.

క్షుద్రపూజల కలకలం



మద్దికెర: బసినేపల్లి గ్రామ శివార్లలో మదనంతాపురం గ్రామ పొలాలకు వెళ్లే దారిలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. మంగళవారం ఉదయం పొలాలకు వెళుతున్న రైతులు గుర్తించి గ్రామస్తులకు తెలిపారు. దీంతో గ్రామంలో అలజడి రేగింది. ముగ్గు పొడితో ముగ్గు వేసి మధ్యలో టెంకాయ వుంచి చుట్టూ పాపర కాయలు వేశారు. నిత్యం జనం ఉపాధి, పొలం పనులకు వెళ్లే దారిలో ఇలాంటి పనులు చేయడంతో భయాందోళన చెందుతున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నాగరాజు

డోన్ టౌన్: ప్రమాదవశాత్తూ ఓ ట్రాక్టర్ డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు.లక్ష్మంపల్లె గ్రామానికి చెందిన ట్రాక్టరు డ్రైవరు వెంకటేశ్ (20) మంగళవారం వెంకటాపురం చెరువు నుంచి ట్రాక్టరు మట్టి లోడుతో బయలుదేరాడు. మార్గమధ్యలో పెద్ద వంక వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి కింద పడటంతో ట్రాక్టర్ ట్రాలీ టైర్లు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్‌ఐ నాగరాజు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.